ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

సామాన్యుల కేంద్ర బిందువుగా విధానాలుండాలి

- ప్రభుత్వాల తీరుతో ప్రజలపై విపరీత భారాలు
- మార్కెట్ విలువ ఆధారిత ఇంటి పన్ను దారుణం
- స్మార్ట్ మీటర్లతో విద్యుత్ ఛార్జీలు రెట్టింపు
- ఐక్య పోరాటాలతో ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి
- 'విశాఖపట్నం అభివృద్ధి - నిధులు - సంస్కరణలు' సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న రామచంద్రయ్య, వేదికపై మధు, బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సామాన్యుల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా ప్రభుత్వాల విధానాలు ఉండాలని పలువురు వక్తలు అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం 'విశాఖపట్నం అభివృద్ధి - నిధులు - సంస్కరణలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యులు సి.రామచంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా నిలబడే పునాది లేకపోయినా గాల్లోకి ఎగురుదామనే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, నగరాల్లో ఫ్లైఓవర్లు, మెట్రో రైళ్లు ఎన్ని వచ్చినా రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు తెలుపుతున్నాయని, ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే దీనికి పరిష్కారమని అన్నారు. ప్రజా రవాణాను తీసుకొచ్చినట్లయితే రద్దీ, ప్రమాదాలు, కాలుష్యం, అసహనం వంటివి తగ్గుతాయని, ప్రజలు ఐక్యమవుతారని తెలిపారు. వ్యక్తిగత రవాణా వ్యవస్థ ప్రజలను వేరు చేస్తుందని, మెట్రో రైళ్ల వల్ల ఖర్చు ఎక్కువని పేర్కొన్నారు. మెట్రోను ఉపయోగించుకునే ప్రజల సంఖ్య తక్కువని చెప్పారు. పరిశుభ్రమైన మిగతా 2లో..

త్వరలో ప్రతి గ్రామానికీ 4జి సేవలు

- వచ్చే ఏడాదికి 5జి.. తొలుత పోర్టుల్లో ప్రవేశపెడతాం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 70 టవర్ల ఏర్పాటుకు ఆమోదం
- 'ప్రజాశక్తి'తో బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.విలియమ్స్





ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రతి గ్రామానికీ బిఎస్ఎన్ఎల్ 4జి నెట్‌వర్క్ సేవలు అందించడమే తమ లక్ష్యమని బిఎస్ఎన్ఎల్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.విలియమ్స్ తెలిపారు. సర్వీసులను మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

బిఎస్ఎన్ఎల్ 4జి నెట్ వర్క్ సేవలు ఎంతవరకు వచ్చాయి ?

ఉమ్మడి విశాఖ అంతటా బిఎస్ఎన్ఎల్‌లో 4జి సేవలు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వాస్తవం. దీనిని గమనించి 2, 3 సంవత్సరాలుగా 4జి ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఎట్టకేలకు ఆమోదం వచ్చింది. ప్రస్తుతం 4జి సేవలు పట్టణ ప్రాంతాల వరకు మాత్రమే అందుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో 3, 4 మాసాలలో 4జి సేవలను అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా సిగ్నల్ లేని గ్రామాలలో 4జి నెట్ వర్క్ ఏర్పాటు మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి అడ్డుకోవాలి

1583వ రోజుకు చేరిన ఉక్కు జెఎసి దీక్షలు

వార్త 2లో..

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

వార్త 5లో..

మాస్టార్లూ.. మీరు వెళ్లొద్దు

వార్త 5లో..

మొదటి పేజీ తరువాయి..

సామాన్యుల కేంద్ర బిందువుగా విధానాలుండాలి



సదస్సుకు హాజరైన నగర వాసులు

మంచినీరు అందించడమనేది ప్రభుత్వాల బాధ్యతన్నారు. సింగపూర్ నమూనా గురించి పదేపదే వల్లించే నేతలు ఆ సింగపూర్‌లో అమలవుతున్నటువంటి రవాణా, మంచినీటి సదుపాయం కల్పన వంటివాటిని ఇక్కడ అమలు చెయ్యాలని కోరారు. మార్కెట్ వాల్యూ మీద ఇంటి పన్ను లెక్కించడమనేది అత్యంత దుర్మార్గమైనటువంటిదని విమర్శించారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల మీద, ఆస్తి పన్ను మీద రాబోయే కాలంలో విశాఖపట్నంలోని కలిసొచ్చే పౌర సంఘాలన్నింటినీ కలుపుకొని భారీ సదస్సు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులు చేయాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సదస్సులు రాష్ట్రంలోని ఇతర నగరాల్లో కూడా నిర్వహించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. పట్టణ పౌర సంఘాల సమైక్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని భారీగా నిర్వహించిన సందర్భంగా విశాఖపట్నం వార్తల్లోకి ఎక్కిందని, ఆరోగ్యం కోసం యోగా మంచిదేగానీ.. పట్టణ ప్రజలకు సరైన ఉపాధి, పరిశుభ్రమైన మంచినీరు, ఉండడానికి ఇళ్లులాంటివి లేకపోతే ప్రజలు ఎలా ఆరోగ్యంతో ఉంటారని ప్రశ్నించారు. ముందు వాటి సంగతి ఆలోచించాలన్నారు. ఒకప్పుడు పోస్టల్ కాలనీ, బ్యాంకు కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ వంటివి ఉండేవని, వీటిని ప్రభుత్వం ప్రోత్సహించేదని, ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి గృహ నిర్మాణం వెళ్లిపోయిందని అన్నారు. జివిఎంసి లాంటి స్థానిక సంస్థలను దిగజార్చి ప్రభుత్వాలు పెత్తనం చేస్తున్నాయని తెలిపారు. పౌర సేవలన్నింటినీ ప్రైవేట్‌పరం చేసి ఛార్జీలు వసూలు చేస్తున్నాయని, ఇదే కొనసాగితే మున్సిపల్ కార్పొరేషన్ కాస్తా మున్సిపల్ కంపెనీగా మారుతుందని అన్నారు. అదే జరిగితే కంపెనీపై జివిఎంసికి ఎటువంటి అదుపూ ఉండదన్నారు. ఇళ్ల పట్టాలు లేనివారికి రెట్టింపు ఆస్తి పన్ను విధించబూనడం మరింత దుర్మార్గమని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు తేవడం ద్వారా విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయని తెలిపారు. ప్రజల జేబులు కొల్లగొట్టి, పౌర సదుపాయాలను వ్యాపార వస్తువులుగా మార్చేస్తున్న పద్ధతిని ప్రజా ఉద్యమాలు ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అలా ఉద్యమించడం ద్వారానే చెత్త పన్నును రద్దు చేయించగలిగామని గుర్తు చేశారు. జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా ఉన్న ఐటి పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఉందన్నారు. విశాఖపట్నానికి వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారన్నారు. రాష్ట్ర ఖజానా నుంచి గత దశాబ్ద కాలంలో ఒక రూపాయి కూడా జివిఎంసికి ఇవ్వలేదు సరికదా జివిఎంసి తాలూకా పన్నుల ఆదాయం రూ.350 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటున్నారు. వృత్తి పన్నుద్వారా జివిఎంసికి ఏడాదికొచ్చే రూ.60 కోట్ల ఆదాయాన్ని రాష్ట్ర బడ్జెట్లోకి తరలించుకుపోతోందని, దీనిఫలితంగా నిధులు లేక అప్పుల ఊబిలోకి జివిఎంసి కూరుకుపోతోందని అన్నారు. ప్రజలపై మరిన్ని భారాలు పడేటట్టు ఆస్తి విలువ ఆధారిత పన్నును తీసుకొచ్చారని తెలిపారు. మంచినీరు, మురుగునీరు వంటి వాటిని ప్రైవేటుపరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కౌన్సిల్‌కున్న ప్రాధాన్యత ఇప్పుడు లేదని వాపోయారు. నిర్ణయాలన్నీ ఎక్కడో జరిగి జివిఎంసిపై రుద్దడం జరుగుతోందన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాడితేనే హక్కులు వస్తాయని తెలిపారు. వార్డు అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు మాట్లాడుతూ చెత్త పన్ను, యుజిడి పన్ను వంటి వాటిపై వార్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, ఉద్యమాలను తెలిపారు. నివాస్ కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజల మీద మరిన్ని భారాలు వేస్తూ ప్రైవేటు వారికి దోచిపెట్టే రీతిలో జివిఎంసి నడుస్తోందన్నారు. సదస్సుకు తొలుత అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం బాధ్యులు డాక్టర్ కె.పద్మ ఆహ్వానం పలుకగా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి అడ్డుకోవాలి



దీక్షల్లో కూర్చున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవలసిన బాధ్యత రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఉందని, స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్,ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 1583వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ పేరుతో కేంద్రం ఇచ్చిన రూ.1440 కోట్లను, వివిధ రూపాలలో కేంద్ర ప్రభుత్వం, బ్యాంకుల అప్పులకు జమ చేస్తున్నారని చెప్పారు. ప్లాంట్ ఉత్పత్తికి దోహదపడే విధంగా ఈ నిధులను ఖర్చు చేసే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు తొమ్మిది మాసాలుగా 25 శాతం కోత విధిస్తూ జీతాలు చెల్లిస్తున్నారని, విఆర్ఎస్ పేరుతో పర్మనెంట్ ఉద్యోగులను తొలగిస్తున్నారని, అదేవిధంగా ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సుమారు 4 వేల మందిని అక్రమంగా తొలగించారని ఆరోపించారు. ఈ వాస్తవ పరిస్థితిని కూటమి నాయకులు గుర్తించి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఎస్.ప్రసాద్, కార్యదర్శి డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఎపిఇపిడిసిఎల్ సిజిఎంకు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఎపిఇపిడిసిఎల్ సిజిఎంగా ఉద్యోగోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన ఎల్.మహేంద్రనాథ్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా సభ్యులు ఆదివారం అభినందించారు. ఆదివాసీ ముద్దుబిడ్డ అయిన మహేంద్రనాథ్ విద్యుత్ శాఖలో సిజిఎంగా పదోన్నతి పొందడం ఆదివాసీ ప్రాంతానికే గర్వకారణం అని సభ్యులు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్, కోశాధికారి సీసా శోభన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు వంతల ఆనందరావు కోటిబాబు తదితరులు ఉన్నారు.

ముగియనున్న దరఖాస్తుల గడువు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శాంసంగ్ ఇండియా సాల్వ్‌ఫర్ టుమారో 2025 నాలుగో ఎడిషన్ దరఖాస్తుల గడువు సోమవారంతో ముగియనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధి ఆదిత్య మాట్లాడుతూ ఈ పోటీలో ఇంక్యుబేషన్ ప్రోగ్రాంను విజయవంతంగా ప్రదర్శించిన మొదటి నలుగురికి రూ.కోటి రూపాయల బహుమతి వస్తుందన్నారు.

త్వరలో ప్రతి గ్రామానికీ 4జి సేవలు

(మొదటిపేజీ తరువాయి..) చేయాలనేదే మా ధ్యేయం. సిగ్నల్ లేదన్న సమాచారం గ్రామాల నుంచి వస్తే ఆ ప్రాంతంలో కొత్త టవర్లు ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో 105 లొకేషన్లలో కొత్త టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా 70 టవర్లకు ఆమోదం వచ్చింది. నెల రోజులలోగా ఆ టవర్లు ఏర్పాటు చేస్తాం. మిగిలిన 35 టవర్లకూ ఆమోదం వస్తుందన్న నమ్మకం ఉంది. కేవలం బిఎస్ఎన్ఎల్ మాత్రమే కాకుండా ఇతర నెట్ వర్క్ మొబైళ్లకు సిగ్నల్స్ అందని పరిస్థితి ఉంటే, మాకు ఫిర్యాదు చేస్తే, అటువంటి చోట్ల కూడా బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేస్తాం. కొత్త టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వాయిస్ బాగా రావడంతో పాటు, డేటా అందుతుంది.

ఫైబర్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి ?

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల వరకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి.

స్మార్ట్ ఫోన్లలో వచ్చే తప్పుడు సమాచారంతో అనేకమంది వినియోగదారులు భారీగా డబ్బు నష్టపోతున్నారు ? దీనిపై ఏమంటారు ?

నిజమే. సైబర్ క్రైమ్ నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఆధునికంగా అన్ని పద్ధతులనూ ప్రవేశపెట్టే చర్యలు చేపడతాం. అయితే వినియోగదారులు తమకు వచ్చే ప్రతి కాల్‌కు రెస్పాండ్ కావద్దు. స్క్రీన్‌పై వచ్చే నెంబర్‌తో వారికి పరిచయం ఉంటే తప్ప మాట్లాడకపోవడం మంచిది.

తప్పుడు కాల్స్ వల్ల నష్టపోతే ఫిర్యాదు చేసే అవకాశముందా ?

తప్పనిసరిగా ఉంది. ఎవరికైనా ఇటువంటి పరిస్థితి వస్తే సైబర్ క్రైమ్ 1930 నెంబర్‌కు సాధ్యమైనంత తొందరగా ఫిర్యాదు చేయాలి. అటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే తగు చర్యలు తీసుకొని బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తాం. ఫిర్యాదు ఆలస్యంగా చేస్తే కొన్ని ఇబ్బందులు ఉంటాయి.

బిఎస్ఎన్ఎల్ టవర్ల విషయాలు తెలియజేస్తారా ?

ఉమ్మడి విశాఖ జిల్లాలో 470 టవర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఆ దిశగా చర్యలు తీసుకొని ఇప్పటికే 363 టవర్లు ఏర్పాటు చేశాం. 4జి కారణంగా టవర్లు ఏర్పాటు తప్పనిసరి అయింది.

5జి సేవలు వచ్చే అవకాశం ఉందా ?

తప్పనిసరిగా ఉంది. 2026 నాటికి 5జి నెట్ వర్క్ సేవలు అందివ్వాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. కేవలం ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేటు రంగంలో కూడా 5జి సేవలు ప్రవేశ పెట్టాలని భావిస్తున్నాం. ముందుగా విశాఖపట్నం పోర్టు, అలాగే అదానీ పోర్టు వారికి 5జి నెట్ వర్క్ ఇవ్వాలని అనుకున్నాం. విశాఖపట్నం పోర్టు వారితో మాట్లాడాం. వారు సుముఖంగా ఉన్నారు. ఆ పోర్టు పరిధిలో 5జి సేవలు ప్రవేశ పెట్టాలని భావిస్తున్నాం.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఇటీవల ప్రారంభమైన ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, వైసిపి నాయకులు జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు పాల్గొన్నారు.

పద్మనాభంలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జంక్షన్లో ఆదివారం పాన్ ఇండియా సినిమా షూటింగ్ చేపట్టారు. సినిమా షూటింగ్ జరుగుతుందని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పండగ వాతావరణంలా మారింది. అనగాదేవి మూవీస్ ఆధ్వర్యాన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాతగా రాజా సాగి సత్యనారాయణ రాజు వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోగా రోహన్, హీరోయిన్ హారిక నూతనంగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఈ ప్రాంతానికి చెందినవారు ఎక్కువగా ఉంటూ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

అనిట్స్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఇంగ్లీష్ అండ్ హ్యుమానిటీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బ్రిడ్జింగ్ పెడగాజీ అండ్ పెర్ఫార్మెన్స్ ఇన్ ద డిజిటల్ ఏజ్' అంశంపై రెండ్రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. కళాశాల ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఎ.సత్యఫణికుమారి, ఎయు ఇంజినీరింగ్ కళాశాల హ్యుమానిటీస్ అండ్ సోషల్ విభాగాధిపతి డాక్టర్ నాగ హనుమాన్ పలు అంశాలపై కీలకోపన్యాసం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీరామకృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు.

వ్యక్తిగత రక్షణ అవసరం

ప్రజాశక్తి -గాజువాక : నేటి సమాజంలో వ్యక్తిగత రక్షణ ఎంతో అవసరమని ఇండియన్ మాస్టర్స్ అట్లాంటిక్స్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మంగా ప్రసాద్ అన్నారు. అగనంపూడి సిడబ్ల్యుసి లో ఫౌండేషన్ ఆఫ్ ఎ1 మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్, కరాటే కోచ్ చట్టి నర్సింగరావు దగ్గర శిక్షణ పొందుతున్న 40 మంది విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో విద్యార్థులకు చదువుతోపాటు సెల్ఫ్ డిఫెన్స్‌కు క్రికెట్, కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ తదితరాలు పురుషులతోపాటు మహిళలకు ఎంతో అవసరం అన్నారు. ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి రోజుకు గంట యోగాకు సమయం కేటాయించాలని కోరారు.

కాలువలో పడిన కుక్క

- రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-గోపాలపట్నం : కుక్క కాలువలో పడిందని ఓ మహిళ 108కి ఫోన్‌చేస్తే అగ్నిమాపక వాహనంతో పాటు నలుగురు అగ్నిమాపక సిబ్బంది వచ్చి కుక్కను కాలువ నుంచి తీసి యజమానికి అప్పగించారు. గోపాలపట్నం ప్రధాన రహదారిపై ఈ ఘటన జరగడం.. అగ్నిమాపక యంత్రం రావడంతో ఏమైందా అంటూ ప్రజలు ఆందోళన చెందారు. విషయం తెలిసాక కుక్క కోసం ఇంత ఆర్భాటమా..! అంటూ వెళ్లిపోయారు.

పైపులైను మరమ్మతుల్లో జాప్యం

ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని బాలికల వసతిగృహానికి వెళ్లే రోడ్డులో భగీరథ పథకం కింద వేసిన మంచినీటి పైపులైను పగిలిపోవడంతో నాలుగు రోజుల క్రితం గోతులు తీశారు. పైపులైన్‌ను పూర్తిగా మరమ్మతు చేయకుండా మధ్యలోనే వదిలేశారు. తవ్వి తీసిన మట్టిని రోడ్డుపై వేసి ఉంచడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పైపు నుంచి నీరు కూడా వృథాగా పోతోంది. రహదారికి ఆనుకుని ఉన్న హాస్టల్ విద్యార్థులు, స్థానిక కాలనీవాసులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై వాటర్ వర్క్స్ సిబ్బందిని వివరణ కోరగా, ఐరన్ పైపు, హెచ్‌డి (ప్లాస్టిక్) పైపు అమర్చాల్సి ఉందని, భీమిలికి చెందిన కాంట్రాక్టర్ బుజ్జికి సమాచారం ఇచ్చామని, మెటీరియల్ వచ్చిన వెంటనే పనులు పూర్తవుతాయని చెప్పారు. ఇప్పటికే నాలుగు రోజులు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులైను మరమ్మతులు పూర్తి చేసి, రహదారిని పునరుద్ధరించాలని హాస్టల్ విద్యార్థులతో పాటు స్థానికులు కోరుతున్నారు.



తవ్వి రోడ్డుపై వేయడంతో రవాణాకు అడ్డంకి...

సన్యాసిరావు మాస్టారుకు సన్మానం



సన్యాసిరావు మాస్టారుకు సన్మానిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సన్యాసిరావును ఆదివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆదివారం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈ సన్మాన కార్యక్రమాన్ని వాతావరణం అనుకూలించకపోవడంతో పద్మనాభంలోని జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలోకి మార్చుచేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి డిఇఒ ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అదే గ్రామంలో పుట్టి, ఆ పాఠశాలలో చదువుకొని అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ పొందడం చెప్పలేని ఆనందం అన్నారు. ఇటువంటి పరిస్థితి అరుదుగా కొందరికే దక్కుతుందన్నారు. ఇదే పాఠశాలలో పనిచేసిన క్రాఫ్ట్ టీచర్ అప్పారావు కూడా సోమవారమే ఉద్యోగ విరమణ చేస్తున్నారని తెలిపారు. విరమణ చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను డిఇఒతోపాటు ఎంపిపి కె.రాంబాబు, జడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సిఐటియు జోన్ మహాసభ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో ఆదివారం సిఐటియు భీమిలి జోన్ మహాసభ ఉత్సాహ పూరితంగా జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి మణి మాట్లాడుతూ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సదుపాయాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జులై 9వ తేదీన జరుగనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. అనంతరం సిఐటియు భీమిలి జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్ఎస్ఎన్.మూర్తి, కార్యదర్శిగా ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా వి.నాగరాజు, సీతాదేవి, శ్రీను, సహాయ కార్యదర్శులుగా రవ్వ నరసింగరావు, నీలాటి రాము తదితరులు ఎన్నికయ్యారు.



సిఐటియు భీమిలి జోన్ నూతన కమిటీ ప్రతినిధులు వీరే

జ్యూట్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు వివిధ రకాల బకాయిలను నెల రోజుల వ్యవధిలో చెల్లించాలని జ్యూట్ మిల్లు యాజమాన్యాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. అపరిష్కృతంగా ఉన్న పలు అంశాలపై విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉన్న అతని నివాసంలో ఆదివారం జ్యూట్ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులు, కొన్ని కార్మిక సంఘాల నాయకులతో ఆయన చర్చించారు. పిఎఫ్, గ్రాట్యూటీ, ఫిక్స్ డిపాజిట్లు తదితర ఆర్థిక పరమైన అంశాలపై సమావేశంలో ఎమ్మెల్యే గంటా చర్చించారు. 2009లో జ్యూట్ మిల్లు లాకౌట్ అయినప్పటికీ, సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొనడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో ఇంటక్, కాకాన, టిఎన్‌టియుసి సంఘాల నాయకులు, పిఎఫ్ రీజినల్ కమిషనర్ అవినాష్ కుమార్, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఇ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఆరిలోవ : పేద విద్యార్థుల విద్యా భ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) అడ్మిషన్ల లోటు పాట్లుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షులు గొండు ధనలక్ష్మి లేఖ రాశారు. ఆ లేఖ సారాంశాన్ని ఆదివారం మీడియాకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో కేటాయించిన అడ్మిషన్లలో అధికశాతం పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్న విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు అసలు ఎందుకు నిరాకరిస్తున్నాయో సంబంధిత పాఠశాలలతోనూ, అసోసియేషన్లతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటుచేసి ఇబ్బందులు తెలుసుకొని ప్రణాళికాయుత ముందస్తు చర్యలతో శాతశాతం ఆర్‌టిఇ చట్టం అమలుతో పాటు పేద పిల్లలను, వారి హక్కులను కాపాడాలని కోరారు. ఏటా ఇవే సమస్యలు పునరావృతం అవుతున్నాయన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్ గదిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జి గదిలో గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాకినాడకు చెందిన కుక్కల వాక్‌నాథ్ ఎంవిపి.కాలనీలోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల నేపథ్యంలో గత రాత్రి నలుగురు స్నేహితులు హనుమంతు వాక పరిధిలో ఒక లాడ్జి తీసుకున్నారు. వాక్‌నాథ్ ఆరోగ్యం బాగా లేక ట్యాబ్లెట్ వేసుకొని పడుకున్నారు. నిద్రలోనే గుండె పోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- మినీ అంగన్వాడీ కార్యకర్త దుర్మరణం

ప్రజాశక్తి- కశింకోట : బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం మండలంలోని తీడ గ్రామ మినీ అంగన్వాడీ కార్యకర్త దుంగల విజయలక్ష్మి (38) మృతి చెందారు. సంఘటన వివరాలివి. మండలం తీడ గ్రామానికి మినీ అంగన్వాడీ కార్యకర్త దుంగల విజయలక్ష్మి, ఆమె భర్త దుంగల శ్రీను విశాఖపట్నంలోని సాయి కాలేజీలో చదువుతున్న తమ పెద్దకొడుకును చూసేందుకు ఆదివారం ఉదయం బైక్‌పై బయలు దేరారు విశాఖ జిల్లా పినగాడి వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెనుకన కూర్చున్న విజయలక్ష్మి రోడ్డుపై తూలిపడి, అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. ఆమె భర్త శ్రీనుకు తీవ్రగాయాలుకాగా, చికిత్సకు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. విజయలక్ష్మి మృతితో ఆమె స్వగ్రామం తీడలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఇద్దరు కొడుకులున్నారు. విషయం తెలుసుకున్న పలువురు అంగన్వాడీలు విజయలక్ష్మి ఇంటికి వెళ్లి పరామర్శించి, సంతాపం తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పాత బ్రిడ్జి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులుచేశారు. సిఐ నేతృత్వంలో పోలీసులు సత్య పాన్ షాప్ వద్ద తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఉంచిన తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యాజమాని సత్యంపై కేసు నమోదు చేశారు. మద్యం అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వాసునాయుడు హెచ్చరించారు.

21 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టివేత

భీమునిపట్నం : పెట్రోలింగ్‌లో భాగంగా స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఎస్ఐలు బి.వెంకటరాజు, కె.అనిల్‌కుమార్, సిబ్బంది ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని రాయిపాలెంలో డిఫెన్స్ మద్యం అమ్ముతున్న పి.కృష్ణవేణిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 21 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చట్టసభల్లో బిసిలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసి కులాలలో ఇప్పటివరకు రాజకీయ ప్రాధాన్యత లేని కులాలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బిసి కులాల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పార్టీలకతీతంగా బిసి కులాల తృతీయ ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘం నాయకులు రేవు రత్నకుమారి, పావులూరి హనుమంతరావు, నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప, చట్టసభల్లో మాత్రం ప్రాధాన్యత కల్పించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక శాతంలో ఉన్న బిసిలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఏకమై తమ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత బిసిలపై ఉందని అన్నారు. ఇప్పటికే గుంటూరు, విజయవాడలో సమావేశాలు ఏర్పాటుచేశామని, ఇప్పుడు విశాఖలో కూడా నిర్వహించామని తెలిపారు. తమ హక్కుల సాధనకు పోరాటాలు చేస్తామని అన్ని పార్టీలను ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి యాదవ్, రమణ, వాసుపల్లి జానకిరామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

యుటిఎఫ్


కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, మంచి విద్యను అందించి, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి ప్రభుత్వ పాఠశాలను విద్యా కేంద్రాలుగా మార్చుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన ఎన్ఎడిలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, ప్రభుత్వం జిఒ 19 ద్వారా 9 రకాల పాఠశాలలు ఏర్పాటుచేసిందని, 9652మోడల్ ప్రాథమిక పాఠశాలు, 1 - 10 తరగతుల ఉన్నత పాఠశాలలో 1552, ప్రాథమికోన్నత పాఠశాలలు అప్డేగ్రేడ్ చేసి 779 ఉన్నత పాఠశాలలు, ఫౌండేషన్ పాఠశాలలో 5000, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో 19,000 ఉన్నాయని తెలిపారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందని, వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తద్వారా ప్రభుత్వ విద్యారంగ మనుగడ సాధ్యపడుతుందన్నారు. జిఒ 22 ద్వారా జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో 67732 మంది బదిలీ అయ్యారని, 4779 మందికి ప్రమోషన్ వచ్చిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దానికి అనుగుణంగా విద్యా విధానాన్ని అమలు చేయాలని, పాఠశాల పని వేళల్లో బోధనేతర పనులు, శిక్షణా తరగతులు లేకుండా చూడాలని కోరారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పిఆర్సి కమిషన్ను నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, డిఎ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

జిల్లా ప్రధానకార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించుటకు నమోదు డ్రైవ్ను జులై 5 వరకు చేపట్టాలని, యుటిఎఫ్ కేడర్ అంతా నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని, 10మంది పిల్లలను చేర్పించిన వారిని మండలస్థాయిలో, 20మంది పిల్లలు చేర్పించిన వారిని జిల్లా స్థాయిలో అభినందన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, రియాజ్, నాయకులు బి.జనార్ధన్, మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పివి.నరసింహారావు జీవితచరిత్ర పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రత్న, పూర్వ ప్రధాని కీర్తిశేషులు పివి.నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. పివి.నరసింహారావు 104వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పౌరగ్రంథాలయంలో జరిగిన పివి జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ, విదేశాల మేధావులు, సాహితీకారులు, ప్రజలచే కొనియాడబడిన అపర చాణుక్యులు, రాజనీతిజ్ఞ్యుడు పివి.నరసింహారావు అన్నారు. సభాధ్యక్షులు ఆంధ్రా విశ్వ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ తెలుగు వారంతా పివి చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 16 భాషల్లో ప్రవీణులు, తత్వవేత్త, రాజనీతి దురంధరులు, సాహితీ వేత్త, ఆర్థిక నిపుణులు, చాణుక్యులు ఇలా ఇన్ని లక్షణాలు కల్గిన వ్యక్తులు ప్రపంచంలోనే ఉండరన్నారు. గ్రంథకర్త భాగవతుల శంకర్ నీలు మాట్లాడుతూ, పివి ప్రధానిగా పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోర అవమానాలు కలిచి వేసి, ఆయన అసలు గొప్పతనాన్ని తెలుగు వారికి అయినా తెలియ చేయడం కోసం తెలుగులో ఆయన జీవిత చరిత్ర రాసినట్లు తెలిపారు. ఈ పుస్తకాన్ని పివి కుమార్తె గతంలో విడుదల చేశారని, విశాఖలో ఈ రోజు ఆ గ్రంథం ఆంగ్లం అనువాదం విడుదల చేశామని చెప్పారు.

పివి జీవిత చరిత్రను ఆంగ్లంలో రాసిన డాక్టర్ కె.సత్యనారాయణమూర్తి తన అనుభవాలను సభలో పంచుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ వీసీ డాక్టర్ బాలమోహన్దాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉండానే సంకల్పంతో కేంద్రంలో మానవ వనరుల శాఖను పివి.నరసింహారావు ఏర్పాటుచేశారని తెలిపారు. ఆ శాఖకు ఆయనే తొలి క్యాబినెట్ మంత్రిగా కూడా ఉన్నారన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, భారత దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఎంతో సమర్ధవంతంగా పూర్తి కాలం నడిపించడమే కాక, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘ ప్రతినిధులు శాయిరామ్ సివిఎస్, వడ్డాది ఉదయ్ కుమార్, వి.జగన్మోహన్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు అక్కులు మాస్టారు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -పద్మనాభం

పాండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కాళ్ల అక్కులు సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. పద్మనాభం మండలంలోని మద్ది గ్రామపంచాయతీ పరిధి తులపాలె గ్రామంలో అప్పడు, అచ్చమ్మలకు రెండవ సంతానంగా 1963 అక్టోబర్లో కాళ్ల అక్కులు జన్మించారు. అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1969 - 74 మధ్య ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. పక్కనే ఉన్న అనంతవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1975 నుండి 77వరకు ఆరు ఏడు తరగతులు పూర్తి చేశారు. 1977 నుండి 78లో ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉన్న పారసాం పాఠశాలలో (అప్పట్లో ఉమ్మడి జిల్లాగా ఉండేది) 8వ తరగతి పూర్తి చేశారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 1978 నుండి 80 మధ్య 9, 10 తరగతులను పూర్తి చేశారు. 1980 నుండి 82 మధ్య భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1982 నుండి 83 వరకు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అమరవల్లిలో టిటిసి చేశారు. 1983 నుండి 86 వరకు విజయనగరంలోని మహారాజా కాలేజీలో బిఎ డిగ్రీ పూర్తి చేశారు. 1986 జనవరి 8వ తేదీ ఎస్జిటి ఉపాధ్యాయునిగా భీమిలి సమితిలో ఉన్న పేకేరు ప్రాథమిక పాఠశాలలో చేరారు. 1987 మార్చి 31వ తేదీ వరకు అక్కడే పనిచేశారు. 1987 ఏప్రిల్ 1వ తేదీన అరకు మండలంలో ఉన్న అట్టగూడ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ 1989 ఆగస్టు 31వ తేదీ వరకు పని చేశారు. 1989 సెప్టెంబరు 1వ తేదీ నుండి ఆనందపురం మండలం వేమగొట్టిపాలెంలో 1996 ఆగస్టు 31వ తేదీ వరకు పనిచేశారు. అదే మండలంలో ఉన్న చెర్లపాలెం పాఠశాలకు 1996 సెప్టెంబర్ 1న నాన్ ప్యానెల్ ప్రధానోపాధ్యాయులుగా బదిలీ అయ్యారు. 2009 ఫిబ్రవరి 6వ తేదీ వరకు పనిచేశారు. 2004లో ఆ పాఠశాలను ప్రాథమికోన్నత, 2007లో జిల్లా పరిషత్ హైస్కూల్గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2009 ఫిబ్రవరి 7వ తేదీన స్వగ్రామమైన మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్కు సోషల్ అసిస్టెంట్గా ప్రమోషన్తో బదిలీపై వచ్చారు. 2009 జులై 31వ తేదీ వరకు పనిచేశారు. 2009 ఆగస్టు 1వ తేదీన అదే మండలంలో ఉన్న గంధవరం జిల్లా పరిషత్ హైస్కూల్కు బదిలీ అయి 2016 ఏప్రిల్ 22వ తేదీ వరకు పనిచేశారు. 2016 ఏప్రిల్ 23 నుంచి 2023 జూన్ 11 వరకు పద్మనాభం హైస్కూల్లో పనిచేశారు. 2023 జూన్ 12న పాండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం అదే పాఠశాలలో సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

1988వ సంవత్సరంలో మద్ది గ్రామానికి చెందిన నల్లి వెంకటరావు కుమార్తె లక్ష్మీకుమారితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల్లో ఒకరు ఉపాధ్యాయులుగా, మరొకరు బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.


అక్కులు మాస్టారు దంపతులు

వైసిపి అరాచకాలను ఎండగట్టాలి

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి అరాచక రాజకీయాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న ప్రజా రంజకమైన పరిపాలన చూసి ఓర్వలేక జగన్మోహన్రెడ్డి ఓదార్పు పేరుతో శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న చౌకబారు రాజకీయాలను ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించి, పెట్టుబడులు పెట్టాలని చూస్తున్న పారిశ్రామికవేత్తలను భయాందోళనకు గురిచేయాలని జగన్మోహన్ రెడ్డి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులు ఎన్ని డ్రామాలు ఆడినా రాష్ట్రంలో ప్రస్తుతం సాగవన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం చేపట్టి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలుపరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమినాయుడు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ముసిరి శ్రీనివాసరావు, దొమ్మేటి పెరిమాలు, కడవల రమణ, పెదపూడి అప్పలస్వామి, యల్లంకి రమణ, కదిరిపోలిరాజు. దుమ్మిడి సోమినాయుడు పాల్గొన్నారు.


ప్రతిభా పురస్కారాలను అందిస్తున్న మావూరి వెంకటరమణ తదితరులు

దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి -గాజువాక : జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాజువాక క్లబ్ ఫంక్షన్ హాల్లో ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం-2025 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘం చైర్మన్ ఉప్పు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ మాట్లాడుతూ, చదువుతో పాటు లక్ష్యాన్ని నిర్దేశించుకొని భావి భారత పౌరులురుగా ఎదగాలని కోరారు. పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో పురస్కారాల ద్వారా వారిని చైతన్యపరుస్తున్నామని చెప్పారు. దేవాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదని ప్రోత్సాహాన్నిస్తున్నామని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వందలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలి వచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొమ్మన సత్యరాజ్ కుమార్, కార్యదర్శి చల్లా నాగేశ్వరరావు, మావూరి రామారావు, కాలెపు సదాశివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదివారం పర్యటించారు. సంజీవయ్య నగర్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం వార్డులోని గ్రీన్బెల్ట్లలో జరుగుతున్న హార్టీకల్చర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగి అనూప్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సన్మానాలు బాధ్యతను పెంచుతాయి

ప్రజాశక్తి -గాజువాక : సన్మానాలు బాధ్యతను మరింత పెంచుతాయని స్టీల్ప్లాంట్లో ఉద్యోగ విరమణ చేసిన వైవి.సుధాకర్ అన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఐటిఐలో చదువుకున్న స్నేహితులందరూ కలిసి ఆదివారం సుధాకర్ను సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, 35 సంవత్సరాల పాటు విశాఖ స్టీల్ ప్లాంట్లో పనిచేశానని తెలిపారు. స్టీల్ప్లాంట్లో ఉద్యోగం వచ్చిన తర్వాత చక్కని జీవితం అందిందని తెలిపారు. ఇలాంటి స్టీల్ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఎంతోమంది త్యాగాలు, 64 గ్రామాల రైతు కుటుంబాలు భూములిచ్చిన ఫలితంగా విశాఖ స్టీల్ప్లాంట్ ఏర్పడిందని, దీన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


సుధాకర్ దంపతులకు సన్మానం

సమస్యలపై పోరాటానికి సిద్ధం



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి -చోడవరం :ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని చోడవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గ్రామస్థాయిలో పార్టీ కేడరంతా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, ఎంపిపి గాడి కాసు, జెడ్‌పిటిసి దొండ రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మారిశెట్టి విజయశ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్, పార్టీ నాయకులు పినబోయిన అప్పారావు యాదవ్, వెంపలి ఆనంద్ ఈశ్వరరావు, ఒరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య, పుల్లేటి వెంకట్రావు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం



శివశంకర్‌ను సత్కరిస్తున్న జిమ్ సభ్యులు

ప్రజాశక్తి -వడ్డాది : నిత్య వ్యాయామంతో జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చని స్థానిక ఎస్ఆర్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ గండెం వెంకటేష్ అన్నారు. ఆదివారం జిమ్ వద్ద అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మిస్టర్ ఆసియా బాడీ బిల్డర్, టీం ఇండియా కోచ్ టి శివశంకర్ మాట్లాడుతూ నేటి యువత విద్యతో పాటు మంచి ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనయానానికి బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ అవసరమన్నారు. అనంతరం శివశంకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిమ్ సభ్యులు స్థానిక నాయకులు యువకులు పాల్గొన్నారు

వారాహిదేవిగా కనకదుర్గ



అమ్మవారిని దర్శించుకున్న ఆలయ, ఉత్సవ కమిటీలు

ప్రజాశక్తి - అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బోగాపురపు వెంకటరమణ (బాబు), ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆషాడమాసం శుద్ధ పంచమి రోజున ఆదివారం అమ్మవారిని వారాహి దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాంగ్రేసు నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ, గౌరీపరమేశ్వరుల, మరిడిమాంబ, గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై వచ్చేనెల 9న 11 కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. లోకనాథం, ఆర్.శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలనురద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, కార్మిక హక్కులు, చట్టాలకు విఘాతం కలిగేలా తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, సమ్మె చేసే హక్కు లేకుండా చేయడం ద్వారా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎనిమిది గంటలు పని విధానం 10 గంటలకు, మహిళలకు రాత్రి షిఫ్ట్ డ్యూటీలు వేయడం, ఓవర్ టైం 70 గంటల నుంచి 144 గంటలకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని, ఇవి నిరుద్యోగాన్ని పెంచే చర్యలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎం నాగేషు, జి.వరలక్ష్మి వి.సత్యవతి, జి .సత్యనారాయణ, ఆర్.రాము ఏ.రాజు, పరమేశ్వరరావు, శాంతి పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఇతర నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : టెన్త్ ,ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన యాదవ విద్యార్థులకు ఆదివారం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేసి సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన సాయినాథరావు (బాబూరావు) యాదవ్ అధ్యక్షతన పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దూలి రంగనాయకులు, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు భరణికాన రామారావు పాల్గొని, జిల్లాలోని 200 మంది యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఇంటర్‌లో 992 మార్కులతో టాపర్‌గా నిలిచిన కురందాసు శ్రీజకు రూ.ఐదు వేలు, 985 మార్కులతో రెండవ స్థానంలో చందక రోష్ని కు రూ.2500 నగదు, టెన్త్ లో 594 మార్కులతో మొదటి స్థానంలో ఉన్న బాలబోయిన బాలాజీ కి రూ. 5వేల నగదు, 592 మార్కులతో ద్వితీయస్థానంలో ఉన్న పల్లా అనుష్కకు రూ.2, 500 నగదు అందజేశారు. అలాగే ఒక్కొక్కరికీ రూ.వెయ్యి నగదు, కాలేజీ బ్యాగ్, సంఘం మెమెంటో ఇచ్చి, శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఉద్యోగులపై వేధింపులు దుర్మార్గం

- బాధిత కస్తూర్బా ప్రిన్సిపల్‌ను పరామర్శించిన ప్రజాసంఘాల నేతలు



ప్రిన్సిపల్ అన్నపూర్ణను పరామర్శిస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : విధి నిర్వహణలో జోక్యం చేసుకుంటూ, ఉద్యోగులను ఒత్తిళ్ల, వేధింపులకు గురిచేయడం సరికాదనియుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయ్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు వివి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు పిఎన్‌వి. పరమేశ్వరరావు, నాగిరెడ్డి సత్యనారాయణ అన్నారు. చోడవరం ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు, కూటమి నేతల ఒత్తిడి, వేధింపులను భరించలేక అస్వస్థతకు గురై, చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న వడ్డాది కస్తూర్బా ప్రిన్సిపల్ అన్నపూర్ణను ఆదివారం శారదానగర్‌లోని ఆమె స్వగృహంలో కలిసి పరామర్శించారు. అండగా ఉంటాం, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న చోడవరం ఎమ్మెల్యే రాజు తమ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాల్సింది పోయి ఒత్తిళ్లకు గురిచేయడం దుర్మార్గమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తన అనుయాయులకు కస్తూర్బాలో సీటుకోసం ప్రిన్సిపల్‌ను తన వద్దకు రప్పించుకోవడమే కాకుండా, దుర్భాషలాడి మానసిక క్షోభ, అస్వస్థతకు గురయ్యేలా వేధించడం సరికాదన్నారు. ఉద్యోగులను రాజకీయ వేధింపులకు గురిచేస్తున్న ప్రజాప్రతినిధుల ఆటకట్టించేందుకు ఉద్యోగ సంఘాలన్నీ ఏకతాటిపైకొచ్చి తీవ్ర స్థాయిలో ప్రతిఘటిస్తామని, రాష్ట్రస్థాయి ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. వడ్డాది ఘటనపై తగు చర్యలకు రాష్ట్రవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు.

ఉద్యోగుల పట్ల అనుచిత ప్రవర్తనను ఉపేక్షించం

ప్రజాశక్తి - చోడవరం : ప్రజలు, ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిని జనసేన ఉపేక్షించబోదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు అన్నారు. ఈనెల 27న వడ్డాదిలో కస్తూర్బా ప్రిన్సిపల్ అన్నపూర్ణ పట్ల దురుసుగా ప్రవర్తించిన జనసేన కార్యకర్త షేక్ రసూల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం బాధ్యుడిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పార్టీ శ్రేణులకు హెచ్చరికలు పంపించన్నారు. బహిష్కృతులైన కార్యకర్తలు, నేతలు ఎవరైనా ఎటువంటి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వీల్లేదని, పార్టీ తరఫున ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పాల్గొనడం నిషిద్ధ మన్నారు. దీన్ని కూడా తీవ్రంగా పరిగణిస్తారన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను (పిజిఆర్ఎస్)ను ఈనెల 30న సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్ తో పాటు అన్ని డివిజన్, మండల, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు నేరుగా వెళ్లి ఆయా కార్యాలయాల్లో తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు. పిజిఆర్ఎస్‌కు వెళ్లలేని వారు ఆన్‌లైన్‌లో తమ అర్జీలను meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల పరిష్కార స్థితి సమాచారం కోసం 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ముఖ్య కూడళ్లలో స్టాపర్స్ ఏర్పాటు

హైవేలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసుల చర్యలు



స్టాపర్ ఏర్పాటు చేస్తున్న సిఐ స్వామినాయుడు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారణకు స్టాపర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సిఐ స్వామినాయుడు తెలిపారు. ఆదివారం కశింకోట, శ్రీనివాస ఏజెన్సీ, బయ్యవరం, హెరిటేజ్ కంపెనీ, జామవదలపాలెం, గొబ్బూరు, నరసింగబిల్లి, ఎన్‌జి. పాలెం తదితర గ్రామాల వద్ద జాతీయ రహదారిపై జంక్షన్ల వద్ద వాహనాల వేగనియంత్రణకు స్టాపర్లను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

మాస్టార్లూ.. మీరు వెళ్లొద్దు

- బదిలీ ఉపాధ్యాయుల వీడ్కోలు సభలో కందిపూడి విద్యార్థుల కన్నీటిరోదన



మాస్టారి బైక్ వద్ద రోదిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సార్... మీరు వెళ్లొద్దు? ఇక్కడే ఉండండి అంటూ బదిలీపై వెళుతున్న నలుగురు ఉపాధ్యాయుల పట్ల కందిపూడి యూపిస్కూల్ విద్యార్థుల కన్నీటి అభ్యర్థన పలువురి హృదయాలను కలిచివేసింది. మండలంలోని కందిపూడి యుపి స్కూల్ ఉపాధ్యాయులు లావణ్య, ప్రసాద్, శ్రీరాములు, రమణలకు ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే స్కూళ్లకు కేటాయించగా,ఆదివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు వీడ్కోలు సభ నిర్వహించారు.. వీడ్కోలు సభ ఆద్యంతం హృద్యమంగా సాగింది. విద్యార్థులంతా ఏడుస్తూ, మాస్టార్లు మీరు వెళ్లొద్దు అంటూ రోదించారు. వారిని చూసిన విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు బదిలీ ఉపాధ్యాయులు కూడా కంటతడి పెట్టుకున్నారు. చివరకు బరువైన హృదయాలతో గ్రామం నుంచి వీడ్కోలు తీసుకుని ఉపాధ్యాయులు బైకులపై వెళ్లిపోయారు. చాలాసేపటి వరకు విద్యార్థులను ఓదార్చడం అక్కడున్న వారికి సాధ్యం కాలేదు. నిజమైన గురుశిష్యుల బంధానికి సాక్ష్యాత్కారంగా ఈ ఘటన నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

వేదా డే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని పెద గొల్లలపాలెం గ్రామంలో సప్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే వేదా డే పోస్టర్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందల వెంకట రమణ, మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, ఉగ్గిన రాము, బంతి కోళ్ల పద్మ, బోకం స్వామి నాయుడు, బలిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

విఆర్‌ఒల భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : ప్రజలతో నిత్యం మమేకమై రెవెన్యూ సేవలు అందించే విఆర్‌ఒలకు ఐక్య వేదిక ఒకటి ఉండటం అవసరమేనని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు.ఆదివార జిల్లా విఆర్‌ఒల సంఘ భవన నిర్మాణానికి అతిధులుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సమస్యలు ఉంటాయని, విఆర్‌ఒలు దానికి అతీతులు కాదన్నారు. సంఘ సభ్యులందరూ సమావేశమయ్యేందుకు, తమ సమస్యలను చర్చించుకునేందుకు ఒక వేదిక అవసరమని, విఆర్‌ఒలు దాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎపి ఆమరావతి జెఎసి నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర విఆర్‌ఒల సంఘ అధ్యక్షులు చంటి, ప్రధాన కార్యదర్శి అనుపమ, జిల్లా అధ్యక్షులు రామకాశి, అనకాపల్లి డివిజన్ అధ్యక్షులు ఏ. గణపతి(గణేష్), భవన నిర్మాణ కమిటీ సభ్యులు శశి, ఎరుకునాయుడు, మాజీ అధ్యక్షుడు ఈర్లే శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఎముకల పటుత్వంపై అవగాహన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధీర్

ప్రజాశక్తి -అనకాపల్లి : పట్టణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, అలయన్స్ క్లబ్, టోరెంట్ ఫార్మస్యూటికల్స్ సంయుక్త నిర్వహణలో ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ గుండా సుధీర్ బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర ఆలయంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి రూ.రెండువేలు విలువైన ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ గుండా సుధీర్ మాట్లాడుతూ మారిన జీవన పరిస్థితులు, ఆహారపు అలవాట్లతో చాలా మందిలో ఎముకల పటుత్వం తగ్గుతోందన్నారు. తినే ఆహారం,నీటిలో తగినంత కాల్షియం ఉండడం లేదన్నారు. 50 ఏళ్లు దాటిన వారంతా ఏటా ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం అవసరమన్నారు. మంచి ఆహారంతోపాటు శారీరక వ్యాయామం చేయాలన్నారుకాల్షియం అధికంగా ఉండే పాలు, గుడ్లు, పప్పులు, దుంపలు, పండ్లు, మాంసం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వంకాయల ఈశ్వరరావు, ఎస్ఎస్. ప్రకాష్‌గుప్తా, కోశాధికారి వై సతీష్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ గుండా రమేష్‌గుప్తా, కో చైర్మన్ నుదురుపాటి తాతాజీ, అలయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై. కేశవరావు, కొల్లూరు రామ్మూర్తి, కోశాధికారి పిఎస్‌వి రవికుమార్ (సత్య), కె.సతీష్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

చోడమాంబికకు బంగారు ఆభరణాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : చౌడపల్లి గ్రామంలో కొండపై వెలిసిన చోడమాంబికకు ఆదివారం నెల్లూరు గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసరావు, సాంబశివరావు కుటుంబీకులు రెండున్నర తులాల మంగళసూత్రాలను బహూకరించారు. వీటిని ఆలయకమిటీ చైర్మన్ ఒడిసెల సన్యాసినాయుడు, ప్రతినిధులకు అందజేయగా, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

కార్యక్రమంలో గంజి అప్పలరాజు, టిడిపి గ్రామ అధ్యక్షుడు కర్రి వెంకటరమణ, మాజీ ఎంపిపి వడిసెల శ్రీనివాసరావు, గంజి రామకృష్ణ, కాకి శ్రీనివాసరావు, కాకి శంకర్, రగడ రాము, సోమరత్నం, రత్నమ్మ పాల్గొన్నారు.

నగదు పరిహారమే చెల్లించాలి

- రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, దుకాణాలు, ఇతర ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారాన్ని ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలని రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హరిపాలెం గ్రామంలో ప్రజా సంఘాల ప్రతినిధులు సమావేశంలో ఆర్ రాముతోపాటు, మునగపాక మండల సిఐటియు కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ, రోడ్లు విస్తరణలో కోల్పోతున్న ఆస్తులకు తక్కువ విలువ కట్టి ఆర్‌అండ్‌బి అధికారులు జాబితాలు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గ్రామ సభల్లో టిడిఆర్ బాండ్లు వద్దని నిర్వాసితులంతా స్పష్టం చేసినప్పటికీ, అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు.2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వం గజానికి రూ.15వేలు నుంచి రూ.25వేలు ఇస్తామని ఒప్పందంతో నిర్వాసితుల నుంచి భూసేకరణకు సంతకాలు తీసుకుందని, ఇపుడు టిడిఆర్ బాండ్లు ఇస్తామని మోసం చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు శరగడం కనుమనాయుడు, సెజ్ నిర్వాసితుల సంఘం ప్రతినిధి బద్ద రంగారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

కస్తూర్బా సీట్ల ఎంపికలో కూటమి నేతల దందా దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకన్న : బాధిత ప్రిన్సిపల్‌కు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- వడ్డాది : ఉద్యోగుల బదిలీల నుంచి విద్యార్థుల సీట్లు వరకు ఏ ఒక్కదాన్ని వదలకుండా అధికార కూటమి పార్టీల నేతలు దందాలు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మండిపడ్డారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కస్తూర్బా ప్రవేశాల్లో ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల పెద్దలు జోక్యంతో అర్హులైన సామాన్యులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. సీటు విషయంలో పైరవీలు చేయడమే కాకుండా, తాము చెప్పిన పనిచేయలేదని వడ్డాది కస్తూర్బా ప్రిన్సిపల్ అన్నపూర్ణ పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఆమె అస్వస్థత పాలయ్యేలా చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇటువంటి చర్యలు వల్ల ఒత్తిడి, వేధింపులను తట్టుకోలేని ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితుల్లో దీర్ఘకాలిక సెలవులు, లేదా బదిలీపై వెళ్లే అవకాశం ఉందని ఆవేదన చోడవరం ఎమ్మెల్యే.రాజు, కూటమి నేతల బెదిరింపులతో ఆసుపత్రి పాలైన కస్తూర్బా ప్రిన్సిపల్‌కు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. నిబంధనల మేరకు, రిజర్వేషన్లకు అనుగుణంగా న్యాయబద్ధంగా జరగాల్సిన కస్తూర్బా సీట్లు ఎంపిక ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు జోక్యం సరికాదన్నారు ఇలాంటి ఘటనలతో ఉద్యోగుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆందోళన నెలకొంటోందన్నారు. సిఫార్సులు, పైరవీలకు తలొగ్గని ఉద్యోగుల పట్ల తర్వాత ఆకస్మిక తనిఖీలు పేరుతో వేధించడమే కాకుండా, మహిళలైతే అసభ్యకరంగా ప్రవరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఇది ఉద్యోగుల భద్రతకు, సాఫీగా విధుల నిర్వహణకు విఘాతమేనన్నారు. ప్రిన్సిపల్‌ను వేధించిన వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తూనే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుని స్థాయి వ్యక్తులు కస్తూర్బా సీటు విషయంలో మహిళా ప్రిన్సిపల్‌పై ఒత్తిడి చేయడం, వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, అధికార టిడిపి తగు చర్యలు చేపట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగుల భద్రత కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి, అమలు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

బిసి వర్గీకరణ ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న యాత సంఘం నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలపర్చాలని జిల్లా యాత సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అనకాపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పెంకే మారేష్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ,ఉపాధి, రంగాలలో అమలులో ఉన్న బిసి వర్గీకరణ రిజర్వేషన్ల, రాజకీయ రంగంలో లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న గ్రామపంచాయతీ, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను ఎ,బి,సి,డి కేటగిరీల వారీగా ఆయా కులాలకు కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లును పూర్తిగా బిసి ఆధిపత్య కులాలే అనుభవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే విధంగా బీసీ రిజర్వేషన్లను వర్గీకరించి అమలు చేయాలని కోరారు. లేనియెడల ఇతర అణగారిన బీసీ కులాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్రంలో యాత కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. ఎంబిసి కార్పొరేషన్ పదవి యాతకులానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. యాత కుల విద్యార్థులకు ప్రత్యేక హాస్టళ్ళు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లాఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, న్యాయవాది ఓడిబోయిన రాంబాబు ప్రసంగించారు.

ఏకగ్రీవంగా పాల సొసైటీ సంఘ సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల -2 పాల ఉత్పత్తిదార్ల సంఘానికి ఇద్దరు పాలకవర్గ సభ్యులు ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన మాటూరు నాగరాజు, యాదగిరి శ్రీనులను అనకాపల్లి మండల టిడిపి అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు తదితరులు అభినందించారు. అలాగే పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు సుఖీభవ కార్డు కల్గిన 44మందికి పశుదాణా బేసిన్లు పంపిణి చేశారు. కార్యక్రములో విశాఖ డెయిరి సూపర్వైజర్, యడ్ల ఏసుదాసు, సంస్థ అధ్యక్షులు, పెద్దిశెట్టి బద్రి నారాయణ, వేతన కార్యదర్శి దిమ్మల అర్జునరావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

6న వెంకన్న ఆలయ గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఈ బోనంగి ఫార్మసిటీ కాలనీలోని అభయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 6న తొలి ఏకాదశి సందర్భంగా తొలిసారిగా గిరిప్రదక్షిణను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ఆదివారం సాయంత్రం 4.05 గంటల నుంచి కొండపై ఉన్న అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి పాదాల నుంచి ప్రారంభమై గౌతు లచ్చన్న నగర్ జంక్షన్, పరవాడ పెట్రోల్ బంక్ జంక్షన్, పరవాడ మండల రెవెన్యూ కార్యాలయ జంక్షన్ . ఈ బోనంగి ఆంజనేయస్వామి గుడి నుంచి బికె.స్టీల్ కంపెనీ జంక్షన్, ఫార్మసిటీ కాలనీ మీదుగా తిరిగి పాదాల వరకు గిరిప్రదక్షిణ జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

184 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్లోమెట్రీ టెక్నీషియన్ శ్రీను

ప్రజాశక్తి- సబ్బవరం: స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలోఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది.కళాశాల ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆప్తోమెట్రీ టెక్నీషియన్ డి. శ్రీను పాల్గొని150 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి, ముగ్గురికి కంటే అద్దాలు అవసరమని గుర్తించారు .అలాగే బయట నుండి వచ్చిన 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి ఆపరేషన్లుకు ఎంపిక చేశారు. వారిని ఆసుపత్రి వాహనంలో విజయనగరం ఆసుపత్రికి ఆపరేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి. సూర్య ప్రకాషరావు, కె. శ్రీనివాస వర్మ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- కె. కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో శ్రీ క్లినిక్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్, డాక్టర్ అతియ భాను మాట్లాడుతూ, శ్రీ క్లినిక్‌లో అల్లోపతి, హోమియోపతి వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, వాటినిఅవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో 200మంది రోగులను పరీక్షించి ఉచితంగా అల్లోపతి, హోమియోపతి మందులు అందజేశారు.

ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: ప్రజానాట్య మండలి ఉత్తరాంధ్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు రాజాన దొరబాబు కోరారు. ప్రజల చైతన్యం చేస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టే బాధ్యతను ప్రజానాట్య మండలి తీసుకోవాలన్నారు. ఆదివారం కోడుగంటి గోవిందరావు భవనంలో ప్రజానాట్యమండలి సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు రాజునాయుడు, దేముడుబాబు మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, 45ఏళ్లు నిండిన వారికి ప్రతినెలా రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. తెలంగాణలాగా ఎపి ప్రభుత్వం కూడా సాంస్కతిక మండలి ఏర్పాటు చేసి కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాత్రపల్లి కొండబాబు, వియ్యపు రాజు, సెట్ సత్యనారాయణ ,కెవి రమణ ,కొండూరు రవీంద్ర, పోతురాజు పాల్గొన్నారు.

అదనంగా భూములివ్వం

-తేల్చి చెప్పిన రైతులు, నాయకులు



నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:పరిశ్రమల స్థాపన కోసం అదనపు భూసేకరణకు భూములు ఇచ్చేది లేదని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలో డిఎల్ పురం గ్రామంలో ఆదివారం అదనపు భూసేకరణ వ్యతిరేకిస్తూ పలువురు రైతులు, నాయకులు సమావేశం అయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు మాట్లాడుతూ వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం అదనంగా భూములు సేకరించి రైతుల ఉపాధి దెబ్బతీయొద్దని, భూసేకరణకు సర్వే చేపడితే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసి సేకరించిన భూములను పూర్తిగా వినియోగంలోకి తీసుకు రాకుండానే డి యల్ పురం, వేంపాడు, నెల్లిపూడి గ్రామాల్లో మరలా ఇప్పుడు అదనంగా భూసేకరణ చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుందని, దీనిని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే భూములు ఇచ్చిన రైతాంగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని, అదేవిధంగా భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వివిధ వృత్తిదారులు, కూలీలను కూడా ఏ విధంగానూ ఆదుకోలేదన్నారు. ఇప్పటికే పరిశ్రమల స్థాపన కోసం భూములు ఇచ్చి, ఉపాధి కోల్పోయామని, మిగిలి ఉన్న భూములు కూడా పరిశ్రమలు స్థాపన కోసం సేకరిస్తే తమ మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొబ్బరి, జీడి మామిడి వంటి తోటల ఫల సాయంతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అదనపు భూసేకరణతో తమ ఉపాధిని దెబ్బతీయొద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములు ఇచ్చేది లేదని, అధికారులు భూములు జోలికి వస్తే అడ్డుకుంటామని రైతులు,నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకట రమణ, రైతులు అవతారం రాజు, సూర్యనారాయణ రాజు, గింజాల చిన్న తాతారావు, గింజాల అప్పారావు, వెంకటరమణ, చిన్న, అయినంపూడి తాతారాజు, అల్లు శివ, ప్రసాదుల తాతారావు, ప్రసాదుల రమణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న శివదత్

పౌరసరఫరాల వ్యవస్థను బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి-కోటవురట్ల:పౌరసరఫరాల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు, ఆదివారం మండల కేంద్రంలో గిడ్డంగి వద్ద డీలర్లతో సమావేశమై మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యాసర వస్తువులను సకాలంలో వినియోగదారులకు అందజేయాలని, వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వృద్ధులకు, వికలాంగులకు సకాలంలో సరుకులు అందజేయాలని డీలర్లకు సూచించారు, అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అన్ని ఏమ్లెట్ గ్రామాలకు సరుకులు అందే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

గూడుపమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో రేభాక గ్రామంలో గూడుపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.పలువురు కుటుంబ సభ్యులతో అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

టార్గెట్ల భారం తగ్గించండి

పోస్టల్ గ్రామీణ్ డాక్ సేవక్ ఉద్యోగులు



హాజరైన ఉద్యోగులు

ప్రజాశక్తి-నక్కపల్లి:నెలవారి టార్గెట్ల భారంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని పోస్టల్ గ్రామీణ్ డాక్ సేవక్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉపమాకలో ఆదివారం ఎలమంచిలి డివిజన్ పరిధిలో పోస్టల్ శాఖలో పనిచేస్తున్న గ్రామీణ్ డాక్ సేవక్ ఉద్యోగులు సమావేశమయ్యారు. నెలవారి టార్గెట్ల భారంతో పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఎస్‌బి అకౌంట్ లు, ఐపిపిబి ఎకౌంట్లు, టీడీ, పాలసీలు, సుకన్య యోజన పథకం వంటివి నెలవారి టార్గెట్ల ఒత్తిడి తమపై తీసుకు రావడంతో మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని జిడిఎస్ లు ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారి టార్గెట్ల భారం తగ్గించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. టార్గెట్ల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎలమంచిలి డివిజన్ పరిధిలో ఒకరోజు ధర్నా చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ సెక్రెటరీ డి ఎస్ ఆర్ ప్రసాద్, మాజీ సెక్రటరీ కే మనోహర్, యూనియన్ నాయకులు విశ్వేశ్వరరావు, వీరభద్రం, నరిశే దయానంద్ (దిలీప్), బివి రమణ, ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కథలు చెపుతున్న దమయంతి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖ గ్రంథాల యంలో ఆదివారం లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఇద్దరు మిత్రుల కథలను వివరించారు.ప్రపంచ వింతల గురించి విద్యార్థులకు వివరిం చారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ, జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కెమెరా గొప్పతనాన్ని వివరించారు. రిసోర్స్ పర్సన్ బీఎస్ ప్రసాద్ విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకొని మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు.

నర్సీపట్నంలో తాగునీటికి అవస్థలు

-ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీ ప్రజలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ కార్మికులు తమ సమస్యలపై తొమ్మిది రోజులుగా నిరసనకు దిగడంతో పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాలు, పర్మినెంట్ తదితర డిమాండ్‌ల తో మున్సిపాలిటీ కార్మికులు గత తొమ్మిది రోజుల నుండి ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. మూడు రోజులుగా మహిళలు నీటి బిందెలు పట్టుకుని లైన్లో నిలబడినా నీరు రాలేదు. ఏ సమయంలో వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్న ఇళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం త్వరగా స్పందించాలని, లేదంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.ఇన్ని రోజులుగా కార్మికులు నిరసనలు చేసినప్పటికీ కూటమి ప్రభుత్వంలో కదలికలు కనిపించ లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఇదిలా ఉండగా ప్రస్తుతం మున్సిపాలిటీ అధికారులు మాత్రం కార్మికులతో చర్చలు జరుపుతున్నామని చెపుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం త్వరితగతిన స్పందించకపోతే, తాగునీటి సమస్యతోపాటు పారిశుధ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది. మున్సిపల్ కార్మికుల నిరసనపై ప్రభుత్వం చొరవ చూపి యూనియన్ నాయకులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకోకపోతే పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికులతో యూనియన్ నాయకులతో చర్చలు జరిపి పట్టణ ప్రజలకు తాగునీరు విద్యుత్ సౌకర్యాలను మెరుగు పరచాలని కోరారు.



అడిగర్ల రాజు
సిఐటియు జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న నాయకులు

ఎంఆర్‌పిఎస్ నేతల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మలలో బాబుజగ్జీవన్ రామ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం జరిగింది. జులై 7న మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ పోచపల్లి వెంక్రటావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారుడిపూడి సతీష్, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులిగుజుల రమణ, నాయకులు సోంబాబు, చిన్నబాయి, కృష్ణ, లక్ష్మణ్, చంటి, నూకరాజు, చంటిబాబు, బాలరాజు, రాజు, చిన అప్పారావు, గణేశ్, నూకరాజు, శివ, చరణ్, దుర్గాప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు.

నేడు కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న సోమవారం ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరగనుందని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. మండలంలో సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

చినుకుపడితే ఛిద్రమే...

-అవస్థలు పడుతున్న వాహనదారులు- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి -నర్సీపట్నం: చినుకు రాలితే చాలు స్థానికతహసిల్దార్ కార్యాలయం చిత్తడిగా మారుతోంది. సాక్షాత్తు రాష్ట్ర సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం ఇది. వర్షాలకు తహసిల్దార్ కార్యాలయ ఆవరణ అద్వానంగా దర్శనమిస్తుంది. నిత్యం రద్దిగా ఉండే ఈ కార్యాలయాల సముదాయంలో వివిధ పనులకై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయ ఆవరణలో దుర్గంధం వెదజల్లుతుం డటంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయ ఆవరణలో రహదారి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కోటవురట్ల:

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల రోడ్డు పనులకు 21 కోట్లతో శంకుస్థాపన చేసిన నేటికీ పనులు ప్రారంభం కాలేదు దీంతో, అడ్డురోడ్డు వెళ్లే ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. పందూరు దగ్గర నుంచి అడ్డురోడ్డు వెళ్లే వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర రహదారి అంతా గోతులమయమే. దీంతో, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాదు ఆటోలు, బస్సులు, కార్లలో ప్రయాణం చేసేవారికి సైతం అవస్థలు తప్పలేదు. నియోజవర్గ కేంద్రంలో పలు విద్యాసంస్థలు కర్మాగారాలు, హెటిరో, డెక్కన్, బ్రాండిక్స్, సహా వివిధ కంపెనీలకు వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. వర్షం వస్తే గోతుల్లో నీళ్లు చేరి రోడ్డు కూడా సక్రమంగా కనిపించని పరిస్థితి. కొన్ని సందర్భాలలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రయాణికులు ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు, వర్షం వస్తే రోడ్డు బురదగా మారుతోంది. ఈ రోడ్డుపై ప్రయాణించి కోటవురట్ల మండలానికి చేరుకునేందుకు స్వయంగా హోం మంత్రి కూడా మక్కువ చూపక పోవడంతో మండలంలో పలు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్న వాయిదా వేసుకుంటున్నట్లు అధికార పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు,



కోటవురట్ల మండలం అడ్డురోడ్డులో గోతులుగా ఉన్న రోడ్డు


నర్సీపట్నంలో బురదగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం ఆవరణ

మండల వ్యాప్తంగా పలు రహదారులు చిద్రమై దర్శనమిస్తున్నాయి. అయినా ఏ ఒక్క గ్రామానికి కూడా నిధులు మంజూరు చేయకపోవడం పట్ల అనితమ్మ ఈ రోడ్ల సంగతి ఇంతేనమ్మా అంటూ పలు గ్రామాలలో ప్రజలు, అధికార ప్రతిపక్ష నాయకులు చర్చించుకుంటున్నారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత మండలానికి చేసింది ఏమీ లేదంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చొరవతో నిధులు మంజూరు కాకపోయినా రాకపోకలు సాగించేందుకు జల్లూరు వంతెన అప్రోచ్ పనులను అసంపూర్తిగానైనా చేపట్టగలిగారని, ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది లేకపోయినా నిర్మించిన అప్రోచ్ రోడ్డు పనుల వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్రోచ్ రోడ్డుకు వేసిన మట్టి నదిలోకి కొట్టుకు పోతుంది కొన్ని చోట్ల పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నాటుతుపాకీలు అప్పగించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ఎవరి వద్దనైనా నాటు తుపాకీలు ఉంటే ఐదు రోజుల్లో పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని గొలుగొండ ఎస్సై పీ.రామారావు సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ, నాటు తుపాకీలు ఎవరి వద్ద ఉన్నా చట్టవిరుద్ధమన్నారు. స్వచ్ఛందంగా తుపాకీలు అప్పగించాలని, లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

పోలీసుల ఆధ్వర్యంలో నాకాబంది

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 48 ముఖ్య కూడళ్లలో శనివారం రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు నగర పోలీస్‌కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నాకాబంది నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 115 వాహనాలను తనిఖీ చేయగా వాటిలో హెల్మెట్లు లేని వారిపై 60, సక్రమంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలు 16, ట్రిపుల్‌రైడింగ్ 12 సెల్ ఫోన్ డ్రైవింగ్‌తోపాటు ఇతర కారణాల వల్ల 19 వాహనదారులపై కేసులు నమోదు చేశారు.



ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు

ప్రజాశక్తి- మాడుగుల: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యావేక్షణలో మోదకొండమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని అలంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాకుల చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మాడుగుల గ్రామానికి చెందిన ముశాడి నాగేశ్వరావు పలువురు భక్తులు ఘట్టాలను ఊరేగించారు.

నేడు విశాఖ కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ భవనంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. దీంతో పాటు ప్రజల సౌలభ్యం నిమిత్తం అందుబాటులోకి తీసుకొచ్చిన కాల్ సెంటర్ 1100 ను సంప్రదించి కూడా వినతులను నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.